

★ ★ ★ మా మద్రాసు సినీవిలేఖరి ★ ★ ★

★ పదవీవిరమణజేసిన కాశీపతి చిత్రనిర్మాత కావడం బాగుంటుంది
★ తక్కువఖర్చుతో చిత్రాలు తీయలేరా?
★ బి. ఎస్. రంగా నిర్మిస్తున్న 'వసంతసేన'కు అరకోటి ఖర్చట!
★ ఉడుపులఖరీదు పదిలక్షలు- యాబైరకాల పాదరక్షలు!
★ మనకూ రచయితలున్నారు!

శ్రీ కాశీపతిగారికి విశ్రాంతి

దక్షిణరాష్ట్రాలకు సెన్సార్ అధికారిగా వున్న శ్రీ కపిల కాశీపతిగారు జులై 1 న పదవీ విరమణ యత్నంలో సెలవు తీసుకున్నారు. వారి స్థానంలో శ్రీ రంగరాజన్ కొత్తగా అధికారంలోకి వచ్చారు. ఈయన ఇంతవరకు కేంద్రరవాణా శాఖలో ఉప కార్యదర్శిగా వున్నారు.

శ్రీ కాశీపతి పదవీవిరమణ చేయడం చాలామందికి బాధాకరంగా వున్నది. వీరికి ముందు సెన్సార్ అధికారిగావున్న శ్రీ శాస్త్రి మహా కఠినుడని పేరు గడించారు. ఆయన చేతిలో పిక్చర్ సెన్సార్ కావడం అంటే అసిధారా వ్రతంగావుండేది. ఆయనపేరు చెబితే నిర్మాతలు గజగజలాడేవారు. శ్రీ కాశీపతిగారు వున్నంతకాలంలో ఎవరికీ సింహస్వప్నం కాలేదు. తెలుగువాడు, రసికుడు కావడంవల్ల, తెలుగు చిత్రాలు చాలావరకూ 'అసలు సెన్సార్ అయినవా' అన్నతీరులో వెలువడ్డాయి. కొన్నింటికి యెన్నడూలేని 'ఎ' సర్టిఫికేట్ యిచ్చారు. సెన్సు అంటే సెన్సారు కత్తెరకు భయపడే నిర్మాతలు విచ్చలవిడిగా శృంగారం చిత్రీకరించారు. చివరకు నిర్మాతలకే జుగుప్సాకరంగాతోచి కట్ చేసుకోవడం, నాయకినాయకులకు అంత శృంగారం తెరపై చూపడం యిష్టంలేక కట్ చేయడం జరిగింది. పాపం సెన్సార్ అధికారి కట్ చేశాడన్న అపవాదురాలేదు. రిటైర్ అయిన శ్రీ కాశీపతిగారు సినిమా రంగంలోకి దిగి, చిత్రాలునిర్మిస్తే బావుండును. ఇతరులకు తన లక్ష్యాలు చేసి చూపినవారవుతారు.

ప్రభుత్వం చిన్నచూపు ఫిలిం పరిశ్రమపైననే

రూపాయ విలువ తగ్గడంవల్ల, విదేశాల నుండి దిగుమతి అయ్యే వస్తుజాలంలో కొంత సౌకర్యం కలిగిస్తామని ప్రభుత్వం అన్నది. పన్నులు తగ్గించాలని ఫిలిం పరిశ్రమ కోరింది. ప్రభుత్వం అన్నినివేదికలు అందుకున్నది. మొత్తం 59 పరిశ్రమలకు సంబంధించిన విదేశీ పరికరాల దిగుమతి ఎగుమతి సౌలభ్యం చూపింది. అందులో సినిమా పరిశ్రమలేదు సినిమాలు విజ్ఞాన ప్రచారానికి ముఖ్యమని ఉపన్యాసాలు చెప్పే ఏ మంత్రిగారికీ ఇది తోచలేదు.

గత మూడుసంవత్సరాలలో జరిగిన వాడకంబట్టి ముడిఫిలిం దిగుమతిని ప్రభుత్వం నిర్ణయిస్తుంది. కాని మన చిత్రాలు విదేశాలకు ఎగుమతిచేసే పథకం సవ్యంగా లేకపోవడంవల్ల, విదేశాలనుండి కలర్ ఫిలిం తెప్పించే అవకాశం సన్నగిల్లింది.

నిర్మాణవ్యయం తగ్గిస్తే కొంపమునిగిపోదు

బెంగాలీ చిత్రాలు, మరాటీ చిత్రాలు అతిస్వల్ప వ్యయంతో నిర్మిస్తారు. అది ఎలా సాధ్యమని మనం ప్రశ్నించుకోము. అసలు అంతకు తక్కువ మొత్తంలో అంచనాలే వేయరు మనవారు. అదే చిత్రం హక్కులుకొని, ఆరు, ఎనిమిది లక్షలు ఖర్చుచేసి, ఆ చిత్రంలోని మంచిని తగలేస్తారుకూడా. మనదేశంలోనేకాదు; మహా సంస్కృతీకేంద్రం, నవనాగరికం అనుకునే ఫ్రాన్సులోకూడా చిన్న మొత్తాలతో చిత్రాలు తీయడం జరుగుతోంది. ఇటలీ, జపానుల సంగతి చెప్పనే అవసరంలేదు. మనవారు దుబారాచేసే మొత్తాలతో వారొక సినిమా తీస్తారు. అరులక్షలతోతీసే సినిమాలో ఒకలక్ష దుబారా గ్యారంటీ.

ఫ్రాన్సు, ఇటలీ, జపాను, జెక్ మొదలైన దేశాలలో సినిమా నిర్మాతలు ఎంతో వ్యయంతో ప్రపంచం యావత్తూ మెచ్చుకునే చిత్రాలు తీస్తున్నారు. ఇటీవల 'మాన్ అండ్ వుమన్' అనే ఫ్రెంచి చిత్రం, ఈ ఏడాది కేన్స్ ఉత్సవాలలో గ్రాండ్ ప్రిక్స్ బహుమతి పొందింది. దానికైన ఖర్చు యిరవైవేల డాలర్లు. అంటే మన లక్ష రూపాయలు. చిత్రం చప్పదా! కాదే. అద్భుత కళాఖండంగా ప్రశంసలు పొందింది. దీని దర్శకుడు క్లాడిలేలో 27 సంవత్సరాల యువకుడు. పండ్రెండు మంది మిత్రుల సహకారంతో ఈ చిత్రం తయారుచేశాడు.

తెలుగుదేశం ఒట్టిపోలేదు. మేధస్సుకు క్లాడీలేలోలు మనలోనూ చాలమంది వున్నారు. ప్రపంచంలో అగ్రస్థానం మాదేశానిదే అని నిరూపించవచ్చు. అయితే ముందుకు రావాలి సమర్థులు, ధైర్యం కలవారు.

అర్థకోటి రూపాయలతో 'వసంతసేన' నిర్మాణం


ప్రొడ్యూసరు, దర్శకుడు, కెమెరామెన్ బి. యస్. రంగా ఏది చేసినా అలాగే వుంటుంది. తెనాలిరామకృష్ణ, అమరశిల్పి జక్కన్న నిర్మించిన మనిషి ఆయన. అచ్చం కన్నడిగుడైనా, అచ్చం తెలుగుపై అభిమానం కలవాడు.

సంస్కృతంలో శూద్రకమహారాజు వ్రాసిన 'మృచ్ఛకటికం' నాటకాన్ని తెర కెక్కిస్తున్నారు. తెలుగు, హిందీ భాషల్లో దాదాపు తొమ్మిదిరీళ్ళు పూర్తి అయింది. మద్రాసులో తన స్టూడియోలోని రెండు ఫ్లోర్సులో పెద్దసెట్టువేసి ఉన్నందున ఇటీవల హైదరాబాదులో షూటింగ్ జరిపారు. చారుదత్తుడు అనంగసేన అడవిపిల్లను కలుసుకునే ఘట్టం యిక్కడ చిత్రీకరించారు. చారుదత్తుడుగా శ్రీ నాగేశ్వరరావు, అనంగసేనగా కృష్ణకుమారి, చారుదత్తుని దేవేరి ధృతాదేవిగా అంజలీదేవి, మైత్రేయిగా రేలంగి నటించారు.

'వత్రాలబండిలో బంగారు బొమ్మ' అనే పాటను యిటీవల చిత్రీకరించారు. వసంతసేనగాపద్మినినటిస్తోంది. వీరుకాక శ్రీ ఎస్. వి. రంగారావు, బాలకృష్ణ, గిరిజ, సత్యనారాయణ నటిస్తున్నారు.

ఈ చిత్రానికి మొత్తం 50 లక్షలు ఖర్చుచేస్తారని, చేయకతప్పదని తెలుస్తోంది.

—తరువాయి 10 వ పేజీలో



బి. చంద్రకళ సూళ్లూరుపేట

ప్ర: పబ్లిసిటీవుంటే తారలవుతారా? తారలైతే పబ్లిసిటీవస్తుందా?

జ: అందం, చందం కావలసినలక్షణాలు వుండి పబ్లిసిటీవుంటే తారలవుతారు. తారలైనంతమాత్రాన పబ్లిసిటీ రాదు. తారాపథంలో అహంకార మేఘాలుంటాయి. అవి నటీనటుల్ని చుట్టుముట్టి కప్పుకప్పేస్తాయి.

ఎం. భిక్షమాచారి చౌటుప్పల్

ప్ర: రూపాయివిలువ తగ్గింపువల్ల లాభాలెక్కువా? నష్టాలా?

జ: విదేశీ దిగుమతులవిషయంలో నష్టం, ఎగుమతులవిషయంలో లాభం అని ప్రభుత్వం చెబుతున్నది. ఆ కారణంగా దేశంలో వస్తువులధరలు పెరిగిపోవడం, పెరుగుదలను అరికట్టలేకపోవడం ప్రభుత్వం అసమర్థత.

జి. నాగరత్నమ్మ హిందూపురం

ప్ర: విధి వక్రించినపుడు ఎవరేమన్నా పడవలసిందేనా? మనరాత బావుండనపుడు ఎలాంటివాటినైనా సహించవలసిందేనా?

జ: విధిపై నమ్మకంవుంటే తప్పదుమరి. మనప్రయత్నంవల్లకాని ఫలితాలను విధిపైవేయడం కొంత రిలీఫ్‌గదా!

సి. రాజేశ్వరరావు కావలి

ప్ర: ప్రేమించేందుకు స్త్రీ పురుషులకు కావలసిన క్వాలిఫికేషన్సేవివో తెలుపుతారా?

జ: మంచిమనస్సు, నిష్కల్మషహృదయం, సుఖదుఃఖాలను సమంగా స్వీకరించే సహనం అవసరంగదా!

—తరువాయి 10 వ పేజీలో

గమనిక

ప్రశ్నలను

ఈ క్రిందవున్న కొత్త చిరునామాకు పంపండి:
'యామినీదేవి'
12 బి. సుబ్బారెడ్డి స్ట్రీటు,
వెస్టు మాంబళం,
మద్రాసు-33

చిత్రసమీక్ష

సంగీతలక్ష్మి

సంగీతమూలేదు- లక్ష్మీలేదు!

(బంగోరె)

నాకే సిగ్గు అనిపిస్తున్నది. ఏంటీ 'బంగోరె' ప్రతిచిత్రాన్ని వరసబెట్టి తిడుతున్నాడు అని ప్రక్కనున్న ప్రేక్షక పాఠక మహాశయులు పదేపదే అంటున్నా వున్న విషయాలను బయటపెట్టేవాణ్ణి గనుక నా జాతకం అట్లాంటిది. ఏంచేయమంటారు మన సినిమాలు అట్లా తయారవుతుంటే?

ఎలుంగొడ్డుతోలు తీసుకొచ్చి పెన్నానది నీళ్ళలో కడిగితే అది తెలుపుగా వస్తుందా, మనవెర్రిగాని? అట్లనే మన ఆంధ్రా అబ్బాయి గిడుతూరి సూర్యం రష్యా సీమలో కొన్నేళ్లు వుండివచ్చినంత మాత్రంచేత రష్యావాళ్ళ సినిమా శిల్పం వంటబడ్డుందనే గ్యారంటీ యేమిటి? గిడుతూరి సూర్యంగారు రష్యాలో యేం నేర్చుకొచ్చారోగాని, సినిమా సాంకేతిక కళాంశాలను నేర్చుకునిరాలేదని మాత్రం బాగా స్పష్టపడిపోయింది యీ 'సంగీతలక్ష్మి' చూసినతర్వాత! అంతేకాదు మన ఆంధ్రా సినిమావాళ్ళు ఎన్నిదేశాలు తిరిగొస్తేనేం మనవాళ్ళ సినిమా కళావిజ్ఞానం గ్రొరె తోకంతనేకదా!

ఇప్పుడీ 'సంగీతలక్ష్మి'లో సంగీతమూ లేదు, లక్ష్మీలేదు; వొట్టి దగుల్బాటీ రకం సినిమాల్లో చేరతగింది మాత్రమే. మంచి సంగీతాన్ని విన్పించే అవకాశం కథలో బోలెడంత వున్నప్పటికీ ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడు దర్శకుడు. అట్లా సద్వినియోగం చేసుకోవాలన్న దృష్టికూడా ఆయనలో బొత్తిగా వున్నట్లే కనపడలేదు. సంగీతం కర్ణకఠోరంగా వుందని కాదుగాని, కాస్త వినసొంపైన, శాస్త్ర స్పర్శకలిగిన సంగీత ఛాయలైనాలేవనేదే నా అసంతృప్తి. ఒకటిరెండు పాటలు మినహా అన్నిటిలోను చాలా లూజు సంగీతమే.

తీసుకున్న కథను సహజంగా, కళానుగుణంగా చిత్రీకరించే మెళకువలుకూడా పాటించలేకపోయాడు. అంతా అతుకులతుకులుగా గుదిగ్రుచ్చినట్లున్నది. సహజత్వం పుట్టిపడే ఘట్టాలు చాలస్వల్పంగానైనా వుంటాయనుకొంటే అవీలేవు. నమ్ముకున్న సంగీతంతో దమ్మిడీరాక పొట్టగడవడానికే నానాబాధపడిపోతూవుంటే ఆ సంగీత దంపతులని చెప్పబడే యిద్దరినీ (ఎన్టీరామారావు-జమునలను) వొక పేద్ద యింటిలో వున్నట్లు చూపుతాడు. శోభనపు గది పాట చిత్రీకరణ సందర్భంలో వెనుక వీధిలోని యిళ్లను సెట్ వేసి చూపిస్తాడు- అవి అచ్చం అట్టలతో కట్టిన ఇళ్లని వూగులాడుతూవుంటాయి. పాటలు పాడుతూ వుంటే స్వప్నంలో డ్యాన్సులు చేసుకుంటున్నట్లు; ఆడాన్సులు కూడా యానాది చిందులు, సర్కస్‌గంతులు మాదిరివేగాని ఎక్కడా బారీయత, సంస్కారం, కళ అనే సరకు బొత్తిగా కనపడదు. ఎన్టీరామారావు వొకనర్తకితో (ఎల్విజయలక్ష్మి) పాటలు పాడేందుకు విదేశాలకువెళ్ళి అక్కడ ఆమెతో తగవు తెచ్చుకుని అమాంతం విదేశాలనుంచి నౌకలో తిరిగొచ్చేస్తాడు. అనౌక కాస్త సముద్రప్రమాదంలో చిక్కుకొని గల్లంతవుతాడు. ఈ దృశ్యాన్ని స్వంతంగా తీయలేక ఏవో ఇంగ్లీషు ఫిల్ముతునకనుంచి కట్‌చేసి తెలుగుసినిమాలో అతికించుకొన్నారు. ఇట్లాంటివి సహజంగా చూపలేనప్పుడు కథలో అవి అట్లా ఎందుకు పెట్టుకోవాలి? ఏ బొంబాయికో, ఢిల్లీకో నాట్య ప్రదర్శనలకు వెళ్లినట్లు చూపితే యేమి?

—తరువాయి 10 వ పేజీలో

ప్రకటన

***

నెల్లూరు స్టోన్‌హవుస్‌పేటలో చేరిన లక్ష్మీపురంలో నెల్లూరు మున్సిపల్ వార్డు నెం. 3 రు, డోర్ నెం. 367/A రు గల చిత్తూరు రామయ్య తాలూకు యిల్లును యెవరైన చిత్తూరు మునిరత్నమ్మ వలన విక్రయించుకొన్నయెడల సదరు విక్రయం చెల్లదు. రామయ్యగారికి మొదటిభార్య అను చిత్తూరు సుభద్రమ్మకు మైనరుకుమారుడు వున్నాడు. యీ విషయం యావన్మందికి తెలువడమయినది.

చిత్తూరు సుభద్రమ్మ.
స్టోన్‌హౌస్‌పేట-నెల్లూరు. 9-7-66.

గుడివాడ సబు కోర్టులో

Sc. No. 23 of 1966.

లంక అన్నపూర్ణమ్మ —వాది.
(1) అట్లూరి సుబ్బారావు - (2) యీ. శేషగిరిరావు ... —ప్రతివాద్లు.

ప్రతివాదులు తండ్రి లేటు గోపాలకృష్ణయ్య వాదిపేర 20-6-1957 తేదీన రూ. 2000/- లకు నెల 1-టికి నూటికి రూ. 1/- చొ॥ వడ్డీతో వ్రాసిన ప్రోనోటు బాకీక్రింద వసూలుపోను మిగతా బాకీ అసలు ఫాయిదాలు రూ. 853-87 లకు పై నెంబరున దావాతేబడినది. ప్రతివాద్లు దావానమన్లు అమలునిమిత్తం పబ్లికేషనుకు 26-7-66 తేదికి వాయిదా వేయబడినది. గాన వాయిదానాడు పై కోర్టుకు హాజరై సదరు మీకు వుండుకున్న ఆక్షేపణలు తెలువుకోవలయును.

—జి. వి. అప్పారావు - అడ్వకేటు.

రామచంద్రపురం ప్రిన్సిపల్ మునసబు మేజస్ట్రేటుకోర్టులో

O. S. No. 172 of 1963.
E. P. No. 21 of 1966.

చుండ్రు రామకృష్ణయ్య —వాది.
తామరపల్లి సూర్యనారాయణ-ప్రతివాది.

పై నెంబరు డిక్రీబాకీకి ఈ దిగువ సుదహరించిన ఆస్తి పై కోర్టుయెదుట 2-8-66 తేదిన వేలము జరుగును. గాన కావలసినవారువచ్చి పాడుకొనవచ్చును.

ఆస్తివివరం:- తూర్పు గోదావరిజిల్లా, మండపేట సబు డి॥లో చేరిన మండపేట గ్రామం తాలూకు తిరాయితీ పల్లం రివిజను సర్వే నెం. 122/2 రు, పూరా య 1-33 సెంట్లులో ఉత్తరంలో మధ్య య 0-07 సెంట్లులో సగంవంతు య 0-3½ సెంట్లుకు హద్దులు:- [తూ] 56½ లింకులు చింతా సుబ్బన్న స్థలం [ప] 55½ లింకులు రావీధి [ఉ] 56½ లింకులు త్రిపురారి శంకరం గారిస్థలం [ద] 63 లింకులు ఈ నెంబరులో బొన్నగంట సూర్యనారాయణ గా॥ స్థలం. సదరు హద్దులమధ్య స్థలం. అందులోవున్న తాటిఆకుల యిల్లు, తలుపులు, ద్వారబంధములు, పైకప్పు వగైరాలు సహా యీలం కాబడును. D. H. Value Rs. 600/-

—వి. వి. కృష్ణారావు - వాదిప్లీడరు.

వి. ఆర్. కాలేజి కమిటి

(3 వ పేజీ తరువాయి)

ఉంటున్నారా అనిపిస్తుంది. కాలేజికి సంబంధించి ఆయన యిన్నాళ్లుచేసిన పనులన్నీ కమిటీవారి ఆదేశంతోనే చేశారా? లెక్చరర్ల డబ్బు (యు. జి. సి. స్కేల్సు అరియర్సు తాలూకుడబ్బు) కొన్నివేలు గుప్తమై పోయిందటనే, అదీ కమిటీవారి ఆదేశంతోనేనా? కాలేజి ప్యూన్లు, తోటి వారల జీతాలను సగానికి సగం తగ్గించేసింది కమిటీవారి అనుమతితోనేనా?-అని ఒక విషయజ్ఞుడు ప్రశ్నిస్తున్నాడు.

కమిటీ నిబంధనావళిలో ఎలక్షన్ అధారిటీ కార్యదర్శే అని నిర్దేశింపబడివుంది. ఓటర్లుగా చేరదల్చుకొన్న పాత విద్యార్థుల దరఖాస్తులను పరిశీలించి, వారి పేర్లను రిజిస్టరు చేయించే యేర్పాట్లు చేయడం కార్యదర్శిగారి విధుల్లో వొకటి. విశ్వవిద్యాలయంలో గ్రాడ్యుయేట్ వోటర్లుగా ఎవ్వరైనా పదిరూపాయలు చెల్లించి చేరవచ్చుననే విషయం వారికి తెలియదా? అంతేకాని వారు వివరించినట్లు కమిటీవారు దరఖాస్తులు స్వీకరించాల్సిందిగా కార్యదర్శిని ఎప్పటికప్పుడు కోరుతూ వుండాల్సిన అవసరంలేదు. పాత విద్యార్థులనుండి వోటర్ల దరఖాస్తులు స్వీకరించి, వాటిని పరిశీలించి నమోదు చేయడమనేది కేవలం వొక సాధారణమైన తతంగం. ఈ మామూలు నిత్యపాలనా విషయాలకు సంబంధించికూడా కమిటీని సమావేశపర్చి ఎప్పటికప్పుడు తమ విధులనుగూర్చి ఆదేశాలను, అధికారాలను స్వీకరించాల్సిన అవసరం కాలేజి కార్యదర్శి అన్నవాడికి పట్టాల్సిన పనిలేదు. కాలేజి కార్యదర్శి విధులేమిటో నిబంధనావళిలో స్పష్టంగా నిర్దేశించబడివున్నది.

కాబట్టి దరఖాస్తులు స్వీకరించేందుకు తనకు అనుమతి, అధికారం యివ్వటిదాకా యివ్వలేదని చెప్పి కార్యదర్శిగారు తొలగదోసుకోవడం ఏమి బాగులేదు. కొత్తగా దరఖాస్తులువస్తే తిప్పికొట్టమని కమిటీవారు ఆదేశించివున్నారా? వచ్చిన దరఖాస్తులను నేటిదాక అమలులోవున్న రూల్సునుబట్టి పరిశీలనచేసి వోటర్లుగా నమోదుచేసి కమిటీకి తెలపడమే తనపని. రేపు కమిటీ కొత్తరూల్సును పెడ్తే వాటినిబట్టి అప్పుడు వచ్చేవారిని చేర్చుకోవడం సబబు అనిపించుకొంటుంది. చూస్తుంటే ఇది కేవలం కాలయాపనచేసే ధోరణిగానే కనపడుతుంది కాని, ఇతరంకాదు.

25 తేది వరకు పాత వోటర్లలిస్టులో చచ్చిపోయిన వారెవరో తెల్సుకొని ఆ వివరాలను కమిటీముందుబెట్టి వారి ఆమోదం పొందేందుకు వొకటి రెండు నెలలు; ఆ తర్వాత మళ్ళీ తగు నోటీసులు యిచ్చి కొత్త వోటర్లను చేర్చుకొని మళ్ళీ కమిటీముందు బెట్టి ఆమోదముద్రపొందే పేరుతో మరో మూడునెలలు; ఆ తర్వాత అవీ, యివీ చేర్చి సమగ్రలిస్టును కమిటీ ముందుంచాలనే నెపంతో మరోనెల;-యీలోగా జనరల్ ఎన్నికల వాతావరణం దేశంలో వస్తుంది గనుక ఆ గత్తరలో కాలేజి ఎన్నికలు జరపడం బాగుండదు గనుక జనరల్ ఎన్నికల అనంతరం గాలివాటాలు చూసుకొని కాలేజి ఎన్నికలు జరపొచ్చులెమ్మనే కాలయాపన ధోరణిగానే కనపడుతున్నదని కొందరుచేసే ఆరోపణను, ఈ పరిస్థితిల్లో కాదనడం ఎట్లా?

మరి కొన్ని వదంతులుకూడా వినబడుతున్నాయి - కాలేజి కమిటీవారుమాత్రం గుట్టుచప్పుడుగా తమ కూటమికి చెందిన వోటర్లను నమోదు చేయించేసుకొనే ప్రయత్న సన్నాహాల్లో వున్నారని అంటున్నారు. కళాశాల సిబ్బందికికూడా యీ విషయాలు అంతు తెలియనీయకుండా జరిగిపోతున్నాయనికూడా వినికిడి.

అసలు అయుర్దాయం ఎప్పుడో అయిపోయిన యీ కమిటీ అధ్వర్యంలో నిష్పక్షపాతంగా, న్యాయంగా ఎన్నికలు జరుగుతాయని ప్రజలు నమ్మలేనిస్థితిలో వున్నారు. ప్రభుత్వం కాని, విశ్వవిద్యాలయంకాని జోక్యం చేసుకొని వొక న్యాయమూర్తి హోదా గలిగిన వారిని నియమించి ఎన్నికలు నిర్వహిస్తే ఎవరిలోనూ ఎట్టి అపోహలకు అస్కారంవుండదు.

——

చిత్రసమీక్ష

(9 వ పేజీ తరువాయి)

సముద్ర ప్రమాదంలో ఎన్టీ రామారావు మునిగి పోయినప్పుడు, యిక్కడ ఆయన భార్య జమున నిద్రనుంచి అమాంతం మేలుకొని 'అ౬, లక్ష్మణా' అంటూ మంగళసూత్రాన్ని కళ్లకద్దు కొంటుంది. ఈ బాపతు చిత్రీకరణను యిప్పటికి యే వంద తెలుగు సినిమాల్లోనో చూసివుంటాం. ఇట్లాంటి ఘట్టాలను నవ్యంగా చూపడానికి లేదా? చూపవచ్చు – దర్శకుడు తెలివైనవాడైతే! కాని ఆ అభిరుచి మన గిడుతూరి సూర్యంగారిలో వుంటేగదా!

నాగభూషణంగారి పాత్ర అచ్చం ఆయనకోసమే కల్పించినట్లున్నది. ఇక హాస్య – విదూషకుల పాత్రలు: రమణారెడ్డి, రాజబాబు, సూర్యకాంతం – యీ బృందమంతా నానాగోల చేస్తారు, సందడి కల్గించాలని చేస్తారు, సందడి కల్గించాలని చూస్తారు. ఎందుకు కథను యిట్లా చిక్కు మాలిన మలుపులన్నీ త్రిప్పాల్నో మన దర్శకులే చెప్పాలి.

ఇట్లా చెప్పుకొంటూ పోవాలంటే యీ చిత్రం ఎంత పరమ చెత్తరకందో – అనే విషయం గురించి మాత్రమే చెప్పాలంటే బోలెడంత గ్రంథమవుతుంది. ఇంత సొప్పకట్టచిత్రం గురించి పత్రిక చోటు దండగ చేయడం ధర్మంకాదు గనుక యింతటితో ముగింపు చేసెయ్యడం విజ్ఞత అనిపించుకొంటుంది.

అ౬ మరచాను; వొక్క సందర్భంలో మాత్రం-గిడుతూరి సూర్యంగారు రష్యాలో నిజంగా గడిపివచ్చినవాడే అని అనుకోడానికి వీలువున్నది.ఎందుకంటే వొకడ్యాన్సు ఘట్టంలో 'కత్తి కంకి' సింబల్‌ను చూపిస్తాడు. "నేను రష్యాకు వెళ్ళివచ్చినవాణ్ణి" అని చాటుకోడానికిగాకపోతే మరేవుద్దేశ్యంతో ఆ బాపతు దృశ్యాన్ని చొప్పించాడో మనకు అర్థంగాదు. జానపదాల పేరుతో, డిటెక్టివ్‌ల పేరుతో, కత్తియుద్ధాల పేరుతో ప్రేక్షకుల జేబులు కత్తిరించే దర్శకులు మనలోతయారవుతున్న తైలసంగీతం పేరుతో యీ మోసానికి దిగబడ్డ దర్శకుడు యీయన అని అంటేచాలు.

——

చిత్ర జగత్

(9-వ పేజీ తరువాయి)

'అరబిక్' చిత్రంలో సోఫియాలోరేన్

ఇటీవల జేమ్సుబాండ్, నెపోలియన్ సాల్ చిత్రాలు కొల్లలుగా తయారైనాయి. కుట్రలు, కుతంత్రాలు, హత్యలు వీటిలో ముఖ్యం. 007 ఏజంటు ఎవరినైనా చంపవచ్చు, ఎప్పుడైనా చంపవచ్చు. ఈబావు అటలోకి వచ్చింది సోఫియాలోరెన్ 'అరబిక్' చిత్రంలో. ఈ చిత్రంలో లోరెన్ ధరించిన ఉడుపులు ఖరీదు పదిలక్షల రూపాయలు అయ్యాయట. యీ తైరకాల పాదరక్షలు వాడిందట.

చిత్ర కథలు వ్రాయలేని తెలుగు రచయితలున్నారా?

తెలుగువారు 'బొలో'మని కలకత్తా పరిగెత్తి చచ్చు పుచ్చుకథల్ని సైతంపేరుకు రావడం, ఐయిదూ, పదివేలు అర్పించడం సిగ్గుచేటు బెంగాలీబాబుల్ని మించినకథలు వ్రాయగలవారు తెలుగులో వందలమంది వున్నారు. పొరుగింటి పుల్లకూర రుచి. తెలుగులో వెలువడనున్న కథలు, నవలలు ప్రథమశ్రేణి సినిమాలకు పనికి వచ్చేవే. దమ్ముల్లేక ఎవరూ ఇంగ్లీషునుండి అనువదించుకోవడంలేదు. కానీ, లేకుంటే ఇటలీ, ఫ్రాంసు, జపాన్, అమెరికా సినిమా నిర్మాతలకే నోరూరించే కథలు, తెలుగులో వెలువడుతున్నాయి.

శ్రీ తోట సుబ్బారావు 'పరమానందయ్య' తర్వాత 'భావనసుందరికథ' ప్రారంభిస్తున్నారు. దీనికి కథ ప్రముఖ రచయిత శ్రీ జి. వి. జి. కృష్ణ వ్రాస్తున్నారు. జి. వి. జి. ఎంతోకాలంగా మద్రాసులో, సినిమా పత్రికా పరిశ్రమలో వుంటున్న మేధావి. ఈనాటికి అతని కథలు రెండు తెరకెక్కుతున్నాయి. సంతోషం. జి. వి. జి. లాగా అభిమానంతో, నిర్మాతలను, దర్శకులను ఆశ్రయించలేక, ఆశ్రయించి వారికిష్టమైనపనులు,కర్కుర్తికి చేయలేక వుండిపోతున్న రచయితలు చాలామందివున్నారు. రచయితకు రచయిత గౌరవం మన నిర్మాతలు యివ్వగలిగితే కథలకేం లెక్కలేనన్ని!!

——

ప్రశ్నోత్తరావళి

(9-వ పేజీతరువాయి)

పి. మేఘనాథ్ మైపాడు

ప్ర: ప్రేమ మధుపానంవంటిదని నా అభిప్రాయం. మరి మీఅభిప్రాయం?

జ: వర్షించినతర్వాత మేఘుడు శాంతిస్తాడుగదా! భూమి చల్లబడుతుంది. మధుపానం నిషా కలిగించినా, నిషా దిగినతర్వాతస్థితి నిజమైనప్రేమది.

ఇ. టి. రామారావు కావలి

ప్ర: మీరు సినిమాకుసంబంధించిన ప్రశ్నలకుమాత్రమే సమాధానమిస్తారా? లేక వేరే ఏప్రశ్నకైనా సమాధానం యిస్తారా? జమీన్‌రైతులో ప్రవేశించక ముందు ఏపత్రికలో పనిచేసేవారు మీరు?

జ: ఈ శీర్షిక చదివితే ఏం అనిపిస్తుంది మీకు? పోతే, మీ ప్రశ్నలకు సమాధానాలుయిచ్చేది, చిత్రజగత్ నిర్వహించేది రెండుదశాబ్దాలపాటుగా కథారచయితగా, నవలారచయితగా, సినిమా జర్నలిస్టుగావుంటూ, ఇప్పటికి 40 పుస్తకాలువ్రాసిన ఒక రచయిత, మీ ఉత్తరాలు శ్రీమతి యామినీదెవి కేరాఫ్‌లో వారికిచేరుతాయి.

సి. రాజశ్రీ కావలి

ప్ర: ఆడది అందమైన యువకుడ్నిచూస్తే వెంటనే ఆకర్షిస్తుంది, ఎందువల్లనో తెలుపుతారా?

జ: 'ఆడది' అనే పదప్రయోగంలోనే స్త్రీపై మీకుగల చిన్నచూపు కనిపిస్తోంది. అందం ఆడవారిసొత్తు. మగవారిలో ఆకర్షణ, అందంకాదు.

జి. రాగిణి వరంగల్

ప్ర: కుమారి జయలలితగారు నటిస్తున్న చిత్రములేవి?

జ: అవి ఏమిటో, యెన్నో అవిడకే తెలిసే స్థితిలోలేదు. సగం చిత్రాలు పూర్తి అయాకగాని పేర్లు పెట్టరు. తెలుగు, తమిళం, కన్నడం, చిత్రాలలో నటిస్తోంది.

జి. శ్రీనివాసులురెడ్డి బుచ్చి

ప్ర: దేవిక, నాగేశ్వరరావు యెప్పుడైనా హీరో హీరోయిన్‌గా కలిసినటించారా?

జ: ఒకసారి 'దేవిక' నటి ఏమిటని శ్రీ నాగేశ్వరరావు అన్నారట; అందుకని ఆయన ప్రక్క నటించడం దేవికకు యిష్టంలేదు.

ఎస్. శాంత నెల్లూరు

ప్ర: పొన్నలూరుబ్రదర్సువారు 'భాగ్యరేఖ' 'శోభ' చిత్రాలుతప్ప మరియేచిత్రమూ నిర్మించలేదు కారణం?

జ: 'పాదుకాపట్టాభిషేకం'చూచాక అనుమానం వచ్చిందా!

బి. శ్రీశైలం హైదరాబాదు

ప్ర: ఏ. నాగేశ్వరరావుకు ఇంగ్లీషు రాదుగదా! మరి అమెరికాలో ఏభాషలో మాట్లాడారు?

జ: రాదా! ఎవరన్నారు? అద్భుతంగా వచ్చు.అమెరికావారి బాబుల్లా మాట్లాడగలడు.

రహమతుల్లా సూళ్లూరుపేట

ప్ర: మన నిర్మాతలు మన సంస్కృతిని విస్మరించి పమిటలులేని బిగువైన దుస్తులు, గాఢాలింగనములు ప్రదర్శించి, పచ్చి శృంగారాన్ని ప్రవేశపెడుతున్నారు. మన జాతిని యిలా చిత్రించే చిత్రాలపై ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోదా?

జ: ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు, మంత్రులు యెక్కువగా విదేశపర్యటనలు చేస్తుంటారు. అక్కడ అనుభవంలో చూచినవి, తెరమీదచూస్తే రోతకలగదు సరిగదా, ఇంకా రియలిస్టిక్‌గా లేదనుకోవచ్చు. మన జాతి, సంస్కృతి మడికట్టుకున్నదనా!

వై. ఎస్. విజియా కావలి

ప్ర: క్లియోపాత్ర చిత్రములో మిమ్మల్ని ఎక్కువగా ఆకర్షించినదేది?

జ: చక్కని సరళమైన భాష, భారీసెట్టింగులు, క్లియో అందం.

పి. ప్రసాదరావు గూడూరు

ప్ర: విజయావారు నిర్మించిన చిత్రములలో ఎన్ని రజతోత్సవములు చేసుకున్నవి?

జ: పాతాళభైరవి, గుండమ్మకథ అనుకుంటాను.

సి. రాజేశ్వరీ కావలి

ప్ర: ఎన్. టి. రామారావుగారు హైదరాబాదులో ఎస్టేటు నిర్మిస్తున్నారని విన్నాను. క్రమేణా అక్కడకు బదలీ అవుతారా?

జ: ధోరణి అలాగేవుంది. గాలివాటం మారింది. వీలైతే స్టుడియో నిర్మిస్తారని, ఈసారి చిత్రం అక్కడే తీస్తారని అన్నారు. శ్రీ అక్కినేని మద్రాసు చిత్రాల్లో నటిస్తున్నాడుగా!

——

పంచాంగం

దక్షిణాయనము

జులై 16 తేదీ శనివారం వుదయం 10-30 నుండి దక్షిణాయన పుణ్యకాలము స్నాన దాన తర్పణాదులు ఆచరించేది.

తూర్పుదిశ గురోదయము

జులై 19 తేదీ గురుమౌఢ్యముపోవును. ప్రాగ్దిశ గురువు ఉదయించగలడు.

పుష్యమికార్తె

జులై 20 తేదీ పగలు 10-31 నుండి పుష్యమికార్తె ప్రవేశం.

జులై తిథులు

16 శని	త్రయోదశి	మ.	1-07	గం.వ
17 ఆది	చతుర్దశి	మ.	12-01	గం.వ.
18 సోమ	అమావాశ్య	ఉ.	10-27	గం.వ.
19 మంగళ	అధికశ్రావణశుద్ధపాడ్యమి	ఉ.	8-29	గం.వ.
20 బుధ	విదియ	ఉ.	6-13	గం.వ.
	తదియ	రా.	3-38	గం.వ.
21 గురు	చవితి	రా.	1-04	గం.వ.
22 శుక్ర	పంచమి	రా.	10-23	గం.వ.

—నిమ్మగడ్డ వెంకటేశ్వరశాస్త్రి.

——

తెనుగు విశారద పరీక్షా కేంద్రం - నెల్లూరు

ఆంధ్ర సారస్వత పరిషత్, హైదరాబాదువారు నిర్వహించు తెనుగు విశారద పరీక్షలు నవంబరునెల నెల్లూరునందు జరుగును. అప్లికేషన్‌ఫారములు, ఫీజు ఆగస్టు 25 తేదినాటికి మాకు పంపుకొనవలెను.

వివరములకు - సంఘవ్యవస్థాపకులు:-
నాదెళ్ళ స్వామిశాస్త్రి.
తెల్లువందితులు, బాలాజీనగర్-నెల్లూరు-2

కలిచేడు రిక్రియేషన్‌క్లబ్ చెడుగుడు, బ్యాడ్ మెంటన్ ఆటల పోటీలు

కలిచేడు రిక్రియేషన్ క్లబ్‌వారి అధ్వర్యమున ఆగస్టు 13, 14, 15 తేదులలో చెడుగుడు - బ్యాడ్‌మెంటన్ ఆటలపోటీలు నెల్లూరుజిల్లా స్థాయిలో నిర్వహించబడును. జిల్లావాసులు మాత్రమే పాల్గొనవలెను. పై పోటీలలో పాల్గొనగోరువారు వెంటనే తమయొక్క టీముల వివరములు ప్రవేశ రుసుముతో ఆగస్టునెల 5 వ తేది లోగా "సెక్రటరీ: కె. వి. సుబ్బయ్య, మాదిగ యినాం మైన్ - కలిచేడు - రాపూరు తాలూకా" అడ్రసుకు పంపకోరినాము. ఆగష్టు 6-వ తేది "డ్రా" వేయబడును. లాడ్జింగ్ వసతిమాత్రం ఏర్పాటుచేయబడును. బోర్డింగువసతి వారివారి స్వంత ఖర్చులమీద ఏర్పాటుచేయబడును.

ప్రవేశరుసుము

చెడుగుడు (6 గురు) రూ. 5/- లు.
బ్యాడ్‌మెంటన్ (5 గురు) రూ. 4/- లు.

ఆర్గనైజరు:-
క్లబ్ మేనేజింగు కమిటీ.

ప్రకటన

ఇందువల్ల యావన్మందికి తెలియచేయునది యేమనగా:- నాకు పసుపుకుంకుమలకుగాను నాసోదరులు (1) కనియంపాటి కొండయ్య (2) అ. నరశింహులు (3) అ. మస్తాన్ (4) అ. రత్నం అనువారలు నాకు యిచ్చిన రూ. 300/- లను ఇటీవల వారికిన్ని, నాకున్ను కలిగిన మనస్పర్థలవల్ల తిరిగి వడ్డీతోటి చెల్లించమని తగాదా చేసినందుకు, ఈ రోజువరకు వడ్డీ లెంకట్టీ రూ. 400/- లుగా తేల్చి నాకు బాకీక్రింద ఇవ్వవలసిన రూ. 100/- లు పోను నిల్వ రూ. 300/- లు పెద్దమనుష్యుల సమక్షములో చెల్లించినాను. గనుక యికమీదట వారు నన్ను ఏ విధమైన Demands చేయుటకువీలులేదు. అట్లు చేసిననూచెల్లవు.

తాళ్లపాలెం లక్ష్మమ్మ.
కావలి - నెల్లూరుజిల్లా.

పంచాయతీ సమితి, ఉలవపాడు

టెండరు నోటీసు

పాఠశాల గ్రంథాలయములలో నుంచుటకు గ్రంథాలయ పుస్తకములు రూ. 5,000/- లు మేరకు సప్లయి చేయుటకు సీలువేయబడిన టెండర్లు కోరదమైనది. టెండర్లు అంగీకరించుటకు ఆఖరు తేది 23-7-66 టెండర్లు 25-7-66 తేది ఉదయం 11 గంటలకు సమితి ఆఫీసులో పరిశీలించబడును. టెండరుతో పుస్తకముల కేటలాగును జతపరచవచ్చును.

పి. అభిషేకం,
బ్లాక్ డెవలప్‌మెంటు ఆఫీసరు-ఉలవపాడు